

కుప్పం నియోజకవర్గంలోని పట్టు రైతులకు మంచి రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. ఇక్కడ ఉత్పత్తి అయిన పట్టుగూళ్లను స్థానికంగానే విక్రయించి లాభాలు గడించడానికి అనువైన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబు చొరవతో నియోజకవర్గానికి నాలుగు ఆటోమేటిక్ రీలింగ్ యంత్రాలకు కేంద్రం అనుమతి ఇచ్చింది. - కుప్పం, ఆంధ్రజ్యోతి





పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయ ఆవరణలో నడుస్తున్న ఆటోమేటిక్ రీలింగ్ యంత్రం, బైవోల్టిన్ పట్టుగూళ్లు

కుప్పం 'పట్టు' ఇక 'ఆటోమేటిక్'

- 75 శాతం సబ్సిడీతో నాలుగు రీలింగ్ యంత్రాలకు అనుమతి
- అర్హుల ఎంపికకు రేపు కేంద్ర బృందం రాక

కుప్పం నియోజకవర్గం ఒకప్పుడు పట్టు పరిశ్రమకు పట్టుగొమ్మగా విలసిల్లేది. పట్టు రైతులకు వివిధ రకాలైన పథకాల ద్వారా సబ్సిడీలు లభించేవి. ఐదేళ్ల వైసీపీ పాలనలో అన్ని రంగాలతోపాటూ పట్టు పరిశ్రమకు కూడా సరైన ప్రోత్సాహకం కొరవడింది. పట్టు రైతులను పట్టించుకునే దిక్కే లేకుండా పోయింది. మళ్లీ 2024లో ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడిన తర్వాతినుంచి కుప్పంలో పరిస్థితులు మారుతూ వచ్చాయి. పథకాలు తిరిగి మనుగడలోకి వచ్చి పట్టు రైతులు కోలుకుంటున్నారు. అయితే స్థానికంగా పట్టుగూళ్లనుంచి దారం తీసే రీలింగ్ యంత్రాల కొరత వల్ల ఉత్పత్తి అవుతున్న పట్టుగూళ్లను ఇతర ప్రాంతాలకు వెళ్లి విక్రయించుకోవాల్సి వస్తోంది. దీంతో పట్టు రైతులు కష్టనష్టాలను ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం కుప్పం నియోజకవర్గ పరిధిలో బైవోల్టిన్ పట్టు గూళ్లు నెలకు సుమారు 150 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి అవుతున్నాయి. సీబీ రకం కూడా ఉత్పత్తి అవుతున్నా వీటి శాతం చాలా తక్కువ. ఉత్పత్తి అయిన బైవోల్టిన్ పట్టుగూళ్లలో కేవలం 15 టన్నులు మాత్రమే కుప్పం మార్కెట్టులో రైతులు విక్రయించగలుగుతున్నారు. మిగిలిన గూళ్లను బెంగళూరు, పలమనేరు తదితర మార్కెట్లకు ఎన్నో కష్టనష్టాలకోర్చి తీసుకెళ్లాల్సి వస్తోంది. కాదంటే దళారులకు తెగనమ్మాల్సిన దుస్థితి రైతులది. పట్టుగూళ్లనుంచి పట్టు దారాన్ని వెలికితీసే ఆటోమేటిక్ రీలింగ్ యంత్రాల కొరత వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోంది.

రేపు కేంద్ర బృందం రాక

ఆటోమేటిక్ రీలింగ్ యంత్రాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి అర్హతలను పరిశీలించడానికి కేంద్ర బృందం మంగళవారం నియోజకవర్గంలో పర్యటించనుంది. 200 యాడ్స్ యంత్రం మంజూరు కావాలంటే అర ఎకరా స్థలం, షెడ్డు తదితర సదుపాయాలను లబ్ధిదారుడు చూపించాలి. 400 యాడ్స్ యంత్రానికి ఎకరా స్థలం అవసరం. లబ్ధిదారులు చూపించగలిగే సదుపాయాలు, నమ్మకాన్ని బట్టి నాలుగు లేదా మూడు ఆటోమేటిక్ రీలింగ్ యంత్రాలకు ఓకే చెప్పనున్నారు. ఆ తర్వాత నిబంధనల మేరకు యంత్రాలను సమకూరుస్తారు.



కుప్పంలోని పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయం

ప్రస్తుతం ఉన్నవి రెండు యంత్రాలే

కుప్పంలోని పట్టు పరిశ్రమ శాఖ ఏడీ కార్యాలయంలో ఉన్న ప్రభుత్వ ఆటోమేటిక్ రీలింగ్ యంత్రాన్ని లీజుకు ఇచ్చి నడుపుతున్నారు. శాంతిపురంలో ఉన్నది మాత్రం ప్రైవేటు యంత్రం. ఇవి రెండూ 200 యాడ్స్ సామర్థ్యంతోనే పనిచేస్తున్నాయి. అందువల్ల కుప్పంలో ఉత్పత్తి అవుతున్న పట్టు గూళ్లకు సరిపోవడంలేదు. ఈ సమస్యలను గుర్తించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. కేంద్ర ప్రభుత్వంతో సంప్రదించి నియోకవర్గానికి నాలుగు ఆటోమేటిక్ రీలింగ్ యంత్రాలు మంజూరు చేయించారు. వీటికోసం దరఖాస్తులను పట్టు పరిశ్రమ శాఖ ద్వారా ఆహ్వానించారు. పది మంది దరఖాస్తు కూడా చేసుకున్నారు. ఈ యంత్రాలు రెండు రకాలు. 200 యాడ్స్ సామర్థ్యం కలిగిన యంత్రం ధర రూ.89 లక్షలు, ఇందులో 25 శాతం నగదు మొత్తంతోపాటు జీఎస్టీ భాగాన్ని లబ్ధిదారుడు చెల్లించాల్సి ఉంటుంది. మిగిలిన 75 శాతాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీగా ఇస్తాయి. 400 యాడ్స్ సామర్థ్యం కలిగిన ఆటోమేటిక్ రీలింగ్ యంత్రం ధర రూ.1.5 కోట్లు. దీని విషయంలోనూ 75 శాతం సబ్సిడీ లబ్ధిదారుడికి లభిస్తుంది.



ఉత్పత్తి అయిన పట్టుదారం

రైతుల జీవన ప్రమాణాలు పెరుగుతాయి



75 శాతం సబ్సిడీతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇస్తున్న ఆటోమేటిక్ రీలింగ్ యంత్రాలు నియోజకవర్గానికి వస్తే పట్టు రైతుల జీవితాలు మరింత మెరగవుతాయి. వారి జీవన ప్రమాణాలూ పెరుగుతాయి.

- హనుమంతరాయ, ఏడీ, పట్టుపరిశ్రమ శాఖ

- చిత్తూరులో మద్యం తాగి వాహనాలు నడిపినవారికి విధించిన ట్రాఫిక్ పోలీసులు



రూ.కోటి జరిమానా

మద్యం తాగి వాహనాలను నడపడం వల్లే జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసు రికార్డులు చెబుతున్నాయి. ఎస్పీగా మణికంఠ బాధ్యతలు స్వీకరించాక నెలవారీ జరిపే నేర సమీక్ష సమావేశాల్లో ఈ విషయాన్ని గుర్తించారు. మద్యం తాగి వాహనాలను నడిపే వారిపై కఠినంగా వ్యవహరించాలని సిబ్బందిని ఆదేశించారు. ఏడాది కాలంలో చిత్తూరు నగరంలోనే మద్యం తాగి వాహనాలు నడిపినవారికి ట్రాఫిక్ పోలీసులు.. రూ.కోటి వరకు జరిమానా విధించారు.

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన చిత్తూరుకు ఇతర రాష్ట్రాలు, మండలాల నుంచి పెద్ద సంఖ్యలో వాహనాల్లో జనం వస్తుంటారు. సాయంత్రమైతే వీరిలో ఎక్కువమంది మద్యం తాగి సొంత ప్రాంతాలకు వెళుతుంటారు. మద్యం మత్తులో అపరిమిత వేగంతో వెళుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇలాంటి వారివల్ల ఎదురుగా వచ్చేవారూ తమ ప్రాణాలు కోల్పోతున్నారు.

ట్రాఫిక్ పోలీసుల స్పెషల్ డ్రైవ్

చిత్తూరు నగరంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని ఒక స్పెషల్ డ్రైవ్ కింద చేపట్టారు. రోజూ నాలుగైదు ప్రాంతాల్లో వాహనాల తనిఖీలు చేస్తున్నారు. మంత్రులు, సీఎం, ఇతర ప్రముఖుల పర్యటనలు ఉన్నప్పుడు మినహా మిగిలిన రోజుల్లో వాహనాల తనిఖీ కార్యక్రమాన్ని నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై కేసులు నమోదు చేస్తున్నారు.

రోజుకు సగటున 5 నుంచి 7 కేసుల నమోదు

నగరంలో రోజుకు సగటున 5 నుంచి 7 కేసుల వరకు నమోదు చేస్తున్నారు. మద్యం తాగి పట్టుబడిన ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధిస్తున్నారు. ఈ లెక్కన 2024 ఏప్రిల్ 11వ తేదీ నుంచి 2025 ఏప్రిల్ 12వ తేదీ వరకు 1,100 కేసులను నమోదు చేశారు. వీరికి రూ.1,01,52,500 జరిమానా విధించారు.

ప్రజల్లో మార్పు కోసమే..



ప్రజల్లో మార్పు కోసమే జరిమానా విధిస్తున్నాం. ఇది శిక్ష కాదు.. జాగ్రత్తగా ఉండమని సంకేతం. ఎందుకంటే మిమ్మల్ని నమ్ముకున్న కుటుంబం ఒకటి ఉంటుందని గుర్తు చేస్తున్నాం. మద్యం తాగి వాహనం నడిపితే తొలిసారి రూ.10వేల జరిమానా లేదా ఆరు నెలల జైలు శిక్ష విధిస్తారు.రెండోసారి పట్టుబడితే రూ.15వేల జరిమానా లేదా మూడేళ్ల జైలు శిక్ష ఉంటుంది.

- నిత్యబాబు, సీఐ, చిత్తూరు ట్రాఫిక్

భానుడి భగభగలు

- తవణంపల్లెలో 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండ్రోజులుగా భానుడి భగభగలతో జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఉదయం 11 గంటలు దాటిందంటే రోడ్లపైకి రావడానికి భయపడుతున్నారు. ఆదివారం తవణంపల్లెలో అత్యధికంగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. మండలాల వారీగా.. చిత్తూరు రూరల్, గుడిపాలలో 39.4, ఎస్ఆర్‌పురంలో 39, వెదురుకుప్పం, పులిచెర్ల, యాదమరిలో 38.7, రొంపిచెర్లలో 37.9, సదుంలో 37.3,బంగారుపాళ్యంలో 37.1, జీడీ నెల్లూరు, ఐరాల, నగరి, నింద్ర, పాలసముద్రం, కార్వేటినగరం, పెనుమూరు, విజయపురం, చౌడేపల్లెలో 36.8, పెద్దపంజాణి, గంగవరంలో 36.2, సోమలలో 35.8, బైరెడ్డిపల్లిలో 35.4, శాంతిపురం, గుడుపల్లెలో 35.3, కుప్పంలో 34.7, వి.కోటలో 34.3, రామకుప్పం, పలమనేరులో 33.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

బోసిపోయిన చిత్తూరులోని ఎన్టీఆర్ సర్కిల్



రొంపిచెర్ల కేజీబీవీ విద్యార్థినికి రాష్ట్రస్థాయి అవార్డు

- రేపు స్రవంతికి సన్‌షైన్ స్టార్ అవార్డు ప్రదానం చేయనున్న మంత్రి లోకేశ్



బీఆర్ స్రవంతి

రొంపిచెర్ల/చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల కేజీబీవీలో ఇంటర్ పీఈసీ (ఫిజిక్స్- ఎకనామిక్స్- కామర్స్) గ్రూప్ చదువుతున్న బీఆర్ స్రవంతి వెయ్యి మార్కులకు 935 సాధించింది. దీంతో ప్రభుత్వం ప్రకటించిన సన్‌షైన్ స్టార్ అవార్డుకు ఎంపికైంది. మంగళవారం విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ చేతులమీదుగా ఈ రాష్ట్ర స్థాయి అవార్డు అందుకోనున్నట్లు సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ తెలిపారు. ఈ విద్యార్థినిని డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ సిబ్బంది, కళాశాల ప్రిన్సిపాల్ సుజాత, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి 'పీజీఆర్ఎస్' రద్దు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కారణంగా రద్దు చేసినట్లు కలెక్టర్ సుమిత్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సెలవుదినంగా ప్రకటించిన నేపథ్యంలో జిల్లా, డివిజన్, మండల స్థాయిల్లో జరిగే పీజీఆర్ఎస్ కార్యక్రమాలను కూడా రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని అర్జీదారులు గుర్తించాలని ఆయన కోరారు.

జిల్లా పోలీసు కార్యాలయంలోనూ..

జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించాల్సిన పీజీఆర్ఎస్ కార్యక్రమాన్ని కూడా అంబేడ్కర్ జయంతి కారణంగా రద్దుచేసినట్లు ఎస్పీ మణికంఠ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

భక్తులతో కిక్కిరిసిన కాణిపాకం

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): స్వయంభు కాణిపాక వరసిద్ధి వినాయక స్వామి ఆలయం ఆదివారం భక్తుల రద్దీతో కిక్కిరిసింది. సెలవు రోజు కావడంతో వేలాదిగా భక్తులు వరసిద్ధుడి దర్శనార్థం కాణిపాకం విచ్చేశారు. ఆలయ క్యూలైను పూర్తిగా నిండిపోయి వెలుపల వరకు విస్తరించాయి. ప్రతి ఒక్కరికీ స్వామి దర్శనం కల్పించడానికి ఆలయ అధికారులు కృషి చేశారు. భక్తుల రద్దీ సాయంత్రం వరకు కొనసాగింది.



వరసిద్ధుడి దర్శనార్థం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి

- భర్త, కుమార్తె పరిస్థితి ఆందోళనకరం



మృతి చెందిన శారద

పుంగనూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కారును మినీ లారీ ఢీకొన్న ప్రమాదంలో ఓ టీచర్ మృతి చెందారు. ఆమె భర్త, కుమార్తె పరిస్థితి కూడా ఆందోళనకరంగా ఉంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అన్నమయ్య జిల్లా కలకడ మండలం ఎర్రయ్యగారిపల్లెకు చెందిన వై.వెంకటరమణ(45) తన కుమార్తె కీర్తి(17), ములకలచెరువులో టీచరుగా పనిచేస్తున్న భార్య శారద(40)తో కలసి మదనపల్లెకు ఆదివారం కారులో బయల్దేరారు. మధ్యాహ్నం పుంగనూరు మండలంలోని సుగాలిమిట్ట వద్దకొచ్చేసరికి మదనపల్లె వైపు వెళుతున్న మినీ లారీ అతివేగంగా వచ్చి వీరి కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులోని ముగ్గురూ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు 108 వాహనానికి సమాచారం ఇవ్వడంతో బాధితులను అన్నమయ్య జిల్లా మదనపల్లె ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ శారద మృతి చెందగా.. వెంకటరమణ, కీర్తిల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వీరిద్దరినీ వైద్యుల సూచనలతో కర్ణాటక రాష్ట్ర బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్ తెలిపారు.





తీవ్రంగా గాయపడిన వెంకటరమణ, కీర్తి

పంటలపై కొనసాగుతున్న గజదాడులు



విరిచేసిన సపోటా చెట్టు



వేళ్లతో పాటు పెకలించేసిన కొబ్బరి చెట్టు

కల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై గజ దాడులు కొనసాగుతున్నాయి. ఓ వైపు 13 ఏనుగుల గుంపు, మరోవైపు ఒంటరి ఏనుగు పంటలను ధ్వంసం చేస్తుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. దేవళంపేట పంచాయతీ కుమ్మరిపల్లె వద్ద శనివారం రాత్రి కొబ్బరి, మామిడి, పనస చెట్లను ఒంటరి ఏనుగు ధ్వంసం చేయడంతో అపారనష్టం వాటిల్లింది. ముందుగా తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి ఒంటరి ఏనుగు శనివారం రాత్రి సుమారు 10 గంటల సమయంలో కుమ్మరిపల్లె వద్దకు చేరుకుంది. గ్రామంలోని రైతు ధర్మేంద్ర మామిడితోటలోని 25 ఏళ్ల కొబ్బరి చెట్టును కూకటివేళ్లతో పెకలించింది. పనస, సపోటా చెట్లను విరిచేసింది. అక్కడినుంచి పాళెం, జూపల్లె మీదుగా ఎర్రచెరువు సమీపంలోని రైతు దామోదర్‌నాయుడికి చెందిన పశుగ్రాసంను తొక్కేసింది. ఎర్రచెరువు కట్టపైకి చేరుకుని రోడ్డుమార్గంలో కోటపల్లె విరూపాక్షమ్మ ఆలయం వద్ద కొచ్చింది. సమీపంలోని చెరువు వంక ద్వారా హైవే రోడ్డును దాటుకుని పశ్చిమ విభాగం అటవీప్రాంతం పరిధిలోకి వెళ్లింది. తర్వాత కల్లూరులోని ఇక్బాల్ మామిడితోటలో పనసచెట్టు కొమ్మలను విరిచేసింది. మామిడిచెట్లలోని కాయలను నేల రాల్చింది. మామిడి తోటల్లోని చెట్లను విరుచుకుంటూ తిరుగుముఖం పట్టిన ఒంటరి ఏనుగు తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఆదివారం పగలంతా చితలవంక సమీపంలోని అడవిలో ఒంటరి ఏనుగు తిష్ట వేసినట్లు ఎఫ్ఎస్‌వో మహమ్మద్ షఫీ తెలిపారు.

శిలాతోరణం సర్కిల్ దాకా క్యూలైన్

తిరుమలలో రద్దీ బాగా పెరిగింది. వేంకటేశ్వర స్వామి దర్శనానికి 18 గంటల సమయం పడుతోంది. ఆదివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2 లోని అన్ని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది.

- ఆంధ్రజ్యోతి, తిరుమల



సర్వదర్శనం క్యూలో భక్తులు

గోమరణాలపై అసత్య ప్రచారం చేస్తారా?

● పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి



పలమనేరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): టీటీడీ గోశాలలో గోమరణాలపై అసత్య ప్రచారం చేస్తారా? అంటూ పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి మండి పడ్డారు. పలమనేరులోని తన కార్యాలయంలో ఆదివారం మీడియాతో మాట్లాడారు. భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి అసత్య ప్రచారం చేయడం మంచిది కాదన్నారు. గతంలోనూ శ్రీవారి విషయంలో భూమన చేసిన వ్యాఖ్యలు బాధాకరమని అన్నారు. రాష్ట్రంలో అలజడి సృష్టించి, ప్రశాంతతకు భంగం కలిగించడానికి ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఇకనైనా ఇలాంటివి మానుకోవాలని హితవు పలికారు.

కరుణాకరరెడ్డి వ్యాఖ్యలు బాధాకరం

● పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్



పూతలపట్టు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గోశాలపై టీటీడీ మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అసత్య ప్రచారాలు చేయడం బాధాకరమని పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ అన్నారు. ఆదివారం పూతలపట్టులో మీడియాతో మాట్లాడారు. రాజకీయ అవసరాల కోసం అసత్య ప్రచారం చేయడం నీచ రాజకీయాలకు నిదర్శమన్నారు. చనిపోయిన గోవుల ఫొటోలు గోశాలలో తీసినవని మీరు నిరూపించగలరా..? అంటూ సవాల్ విసిరారు. కల్తీ నెయ్యి వ్యవహారంపై విచారణ జరుగుతున్న సమయంలో వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలన్నీ బయటకు వస్తాయనే ఉద్దేశంతో కుట్రపూరితంగా గోశాలపై అసత్య ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

వరసిద్ధుడి అన్నదానానికి రూ.లక్ష విరాళం



ఆలయ సిబ్బందికి చెక్కును అందిస్తున్న దాత

ఐరాల(కాణిపాకం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి హైదరాబాదుకు చెందిన శివకుమార్ రూ.1,00,116 చెక్కు రూపంలో విరాళంగా అందించారు. ఆలయ సూపరింటెండెంట్ కోదండపాణి దాతకు దర్శన ఏర్పాట్లు చేశారు.

'ఏపీజీఈఏ' కో-ఛైర్మన్‌గా బాలాజీ



చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఏపీ గవర్నమెంట్ ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్యవేదిక (ఏపీ జీఈఏ) కో-ఛైర్మన్‌గా ఆపస్ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. విజయవాడ విద్యాధరపురంలోని కార్యాలయంలో ఛైర్మన్ కేఆర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఈ ఎన్నిక జరిగింది. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి నిబద్ధతతో తన వంతు కృషి చేస్తానని బాలాజి చెప్పారు. తనను ఎన్నుకున్న నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

● మరొకరికి గాయాలు



మృతిచెందిన పరశురాముడు

పలమనేరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ద్విచక్రవాహనాన్ని జీపు ఢీకొన్న ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం రాత్రి పలమనేరు మండలంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గంగవరం మండలం కూర్నిపల్లె గ్రామానికి చెందిన పరశురాముడు(27), చీకలవారిపల్లె గ్రామానికి చెందిన హరి(45) ద్విచక్రవాహనంపై పలమనేరు నుంచి గ్రామానికి బయల్దేరారు. పలమనేరు - మదనపల్లె రహదారిలో శనివారం రాత్రి ఎదురుగా వస్తున్న జీపు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వీరిని స్థానికులు పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరశురాముడు మృతి చెందాడు. మృతదేహానికి ఆదివారం పలమనేరు ప్రభుత్వాస్పత్రిలో శవపరీక్ష నిర్వహించి, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రేత అరెస్టు



గంజాయి విక్రేతను అరెస్టు చూపిస్తున్న పోలీసులు

నగరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి విక్రయిస్తున్న నగరి మండలం ఓజికుప్పం గ్రామానికి చెందిన షణ్ముగం(29)ను ఆదివారం నగరి పోలీసులు అరెస్టు చేశారు. సీఐ విక్రమ్ మాట్లాడుతూ.. ఇప్పటికే ఓజికుప్పానికి చెందిన గంజాయి సరఫరాదారులు కృష్ణ, దొరై, ముత్యాలకుమార్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు. ఆరు నెలలుగా తప్పించుకు తిరుగుతున్న షణ్ముగంను ఆదివారం అరెస్టుచేసి, నగరి మేజిస్ట్రేట్ ముందు హాజరుపరచగా.. రిమాండ్ విధించారని తెలిపారు. గంజాయిపై సమాచారం తెలిస్తే 94407 96723 నెంబరుకు తెలియజేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఆయన పేర్కొన్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి



మృతి చెందిన శివారెడ్డి

పలమనేరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లా ముళబాగిల్‌లోని ఓ లాడ్జిలో పలమనేరుకు చెందిన శివారెడ్డి (30) ఆదివారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సుమారు 20 రోజుల క్రితమే వివాహం చేసుకున్న యువకుడు మృతి చెందడం సంచలనంగా మారింది. కుటుంబీకులు తెలిపిన వివరాల మేరకు.. పలమనేరు మున్సిపాలిటీ గంటావూరు కాలనీలో నివాసముంటున్న శివారెడ్డి శనివారం బెంగళూరుకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పాడు. ఆదివారం ముళబాగిల్ పోలీసులు శివారెడ్డి మృతిచెందాడని కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు. లాడ్జి నుంచి ఓ మహిళ శివారెడ్డిని ముళబాగిల్ ఆస్పత్రిలో చేర్పించిందని, అప్పటికే అతను మృతిచెందినట్లు అక్కడి సిబ్బంది తెలిపారన్నారు. ముళబాగిల్ పోలీసులు కేసు నమోదు చేసి శివారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. ఆస్పత్రిలో చేర్పించిన మహిళ ఎవరన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

తిరుపతి- విశాఖ మధ్య వేసవి ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్) ఏప్రిల్13(ఆంధ్రజ్యోతి): వేసవి రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే వివిధ ప్రాంతాలకు 42 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు సీపీఆర్వో ఎ.శ్రీధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇవి ఈనెల 14 నుంచి మే 29వ తేదీవరకు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు. ఇందులో 14 రైళ్లు విశాఖపట్నం నుంచి తిరుపతి మధ్య రాక పోకలు సాగిస్తాయని వెల్లడించారు. ● విశాఖపట్నం-తిరుపతి మధ్య ప్రత్యేక రైలు (08547) ఈనెల 16 నుంచి మే 28వ తేదీ వరకు ప్రతి బుధవారమూ విశాఖలో బయలుదేరుతుంది. మరో ప్రత్యేక రైలు (08548) ఈనెల 17 నుంచి మే 29వ తేదీ వరకు తిరుపతిలో ప్రతి గురువారమూ బయలుదేరుతుందని తెలిపారు.

● విశాఖపట్నం-బెంగళూరు మధ్య 14 ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, అన్నవరం, విజయవాడ, తెనాలి, ఒంగోలు, రేణిగుంట, జోలార్‌పేట, కుప్పం మీదుగా రాకపోకలు సాగిస్తాయని వివరించారు.

దోస రైతుకు భారీ నష్టం

● పొలం వైపు చూడని వ్యాపారులు

● కూలీల కొరతతో పొలంలోనే పంట ● అల్లాడుతున్న రైతులు



సూరయ్యగారిపల్లె సమీపంలో దోస పంట సాగు

సోమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టపడి రూ.లక్షలు వ్యయం చేసి సాగు చేసిన దోస పంటను కోయలేని దుస్థితిలో రైతులు అల్లాడుతున్నారు. సోమల మండలంలో సోమల, సూరయ్యగారిపల్లె, కరకమంద, పెద్దఉప్పరపల్లె, అన్నెమ్మగారిపల్లె, ఆవులపల్లె పంచాయతీల్లో 700 ఎకరాల్లో దోస పంటను పలువురు రైతులు సాగు చేశారు. ఎకరా సాగుకు రూ.1.50 లక్షలు పెట్టుబడి పెట్టారు. కుందన్ రకం విత్తనాలు కిలో రూ.75 వేలకు కొని నార్లు పోసుకుని పంటలు సాగు చేస్తున్నారు. పంట దిగుబడి ఆశాజనకంగానే ఉంది. ఎకరాకు పెట్టుబడులు పోను రూ.లక్ష ఆదాయం వస్తోందని సంతోషపడ్డారు. గత ఏడాది కిలో రూ.20 నుంచి రూ.22 వరకు విక్రయించారు. ప్రస్తుతం పంట కోతలు చేయలేక వ్యాపారులు పొలం వైపు కన్నెత్తి చూడని పరిస్థితిలో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కూలీలెవరూ పనులకు రావడంలేదు. పంట చేతికి వచ్చినా కోత కోసుకోలేని దుస్థితిలో రైతులున్నారు. దీంతో రైతు కుటుంబ సభ్యులు పంటను పొలంలో వదులుకోలేక ఆటోలు, ట్రాక్టర్లలో కోసిన దోస పండ్లను సమీప గ్రామాలకు తీసుకెళ్లి కిలో రూ.10 వంతున విక్రయిస్తున్నారు. కోత కూలీ, ఆటో ఖర్చులు పోను రైతు చేతికి కిలోకు రూ.5 మిగులుతోంది. ఉద్యానపంటలు టమోటా, బీర, మిరప సాగు చేసిన రైతుల పరిస్థితి ఇలాగే కొనసాగుతోంది. రైతుల నుంచి వ్యాపారులు కిలో రూ.5 లకు కొనుగోలు చేసి రూ.10 లకు విక్రయిస్తున్నారు. లక్షలు వ్యయం చేసి సాగు చేసిన రైతు నష్టాలను చవిచూస్తుండగా .. వ్యాపారులు లాభాలు చూస్తుండటం గమనార్హం.

గల్లా అరుణకుమారి జీవిత చరిత్ర మహిళలకు స్ఫూర్తి

ఎంపీ విజయేంద్రప్రసాద్



విజయేంద్రప్రసాద్‌కు స్వాగతం పలుకుతున్న గల్లా రామచంద్రనాయుడు, అరుణకుమారి దంపతులు

తవణంపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి గల్లా అరుణకుమారి జీవిత చరిత్ర మహిళలకు స్ఫూర్తిదాయకమని ప్రముఖ సినీ దర్శకుడు రాజమౌళి తండ్రి, సినిమా కథల రచయిత, ఎంపీ విజయేంద్రప్రసాద్ అన్నారు. ఆయన ఆదివారం సాయంత్రం తవణంపల్లె మండలంలోని దిగువమాఘం గ్రామంలోని గల్లా నివాసానికి విచ్చేశారు. ఆయనకు గల్లా కుటుంబీకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్థానిక రాజన్న పార్కులోని మాజీ ఎంపీ, దివంగత రాజగోపాల్‌నాయుడు విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ఈ సందర్భంగా విజయేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. అరుణకుమారి జీవిత చరిత్రపై ముద్రించిన పుస్తకాన్ని చదవగా, తనను ఆలోచింప చేసిందన్నారు. మంచి తండ్రికి కూతురుగా, మంచి భర్తకు మంచి భార్యగా, మంచి పిల్లలకు మంచి తల్లిగా, ప్రజలకు మంచి సేవలు అందించే నాయకురాలిగా ఎదిగిన తీరు మహిళలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. గల్లా కుటుంబం అనుమతిస్తే.. అరుణకుమారి జీవిత చరిత్రను సినిమా కంటే వెబ్ సిరీస్ రూపంలో తీస్తే బాగుంటుందన్నారు. ఆ తర్వాత దిగువమాఘం గ్రామంలో గల్లా కుటుంబం ప్రజలకు అందిస్తున్న సేవలను స్వయంగా పరిశీలించారు. అమరరాజా ద్వారా సుమారు 18వేల మందికి ఉపాధి కల్పించిన గల్లా, గౌరినేని కుటుంబాలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, గల్లా రామచంద్రనాయుడు, మాజీ ఎంపీ గల్లా జయదేవ్, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు

స్వల్పగాయాలతో బయటపడ్డ 40 మంది ప్రయాణికులు



పొలంలోకి దూసుకెళ్లిన ప్రైవేటు బస్సు

యాదమరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మినీ వ్యానును తప్పించబోయి ఓ ప్రైవేటు బస్సు పొలాల్లో దూసుకెళ్లింది. బస్సులోని 40మంది ప్రయాణికులు స్వల్పగాయాలతో బయటపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. యాదమరి మండల పరిధిలోని చిత్తూరు - గుడియాత్తం అంతర్రాష్ట్ర రహదారిలో ఓ ప్రైవేటు బస్సు వెళుతోంది. కమ్మరాయనిమిట్ట వద్దకొచ్చేసరికి ఎదురుగా బ్యానర్లతో వస్తున్న మినీ వ్యాను అదుపు తప్పి వస్తుండటంతో బస్సు డ్రైవర్ గమనించాడు. వ్యానును తప్పించే క్రమంలో బస్సు పక్కనున్న పొలాల్లోకి దూసుకెళ్లింది. ఏం జరిగిందో అర్థంకాక ప్రయాణికులు కేకలు పెట్టారు. అదృష్టం కొద్దీ బస్సులోని 40 మంది ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

ఒకవేళ ప్రమాదం జరిగిన ప్రదేశంలో రోడ్డు పక్కన ఉన్న హైటెన్షన్ లైన్ విద్యుత్ స్తంభాన్ని బస్సు ఢీకొని ఉంటే ఘోర ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు తెలిపారు. త్రుటిలో ప్రమాదం తప్పిందని అందరూ ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న యాదమరి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

సిమెంటు రోడ్ల నిర్మాణ బిల్లులు ఎప్పుడిస్తారు?

పెండింగ్‌లో రూ.35 కోట్ల బకాయిలు

వెదురుకుప్పం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామాల్లోని వీధుల్లో సిమెంటు నిర్మాణ పనులు జరిగి శోభ సంతరించుకున్నాయి. జిల్లాలో 1,477 సిమెంటు రోడ్డు పనులు మంజూరయ్యాయి. వీటిలో 1,323 పనులు గ్రౌండింగ్ చేశారు. వీటిలో 1,208 పనులు పూర్తి చేసినట్లు అధికారిక లెక్క. ఈ పనులను ఉపాధి హామీ పథకంలో చేపట్టారు.

జీడీనెల్లూరు నియోజకవర్గ పరిస్థితి ఇది

గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో వెదురుకుప్పం, కార్వేటినగరం, ఎస్‌ఆర్‌పురం, పాలసముద్రం, పెనుమూరు, గంగాధరనెల్లూరు మండలాలు ఉన్నాయి. ఈ మండలాల్లో 223 సిమెంటు రోడ్డు పనులు మంజూరయ్యాయి. వీటిలో 192 పనులు గ్రౌండింగ్ జరగ్గా 183 పనులు పూర్తయ్యాయి.

రూ.35 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉంది

జిల్లాలో చేపట్టిన సిమెంటు రోడ్డు పనులకు రూ.35 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. గత ఏడాది డిసెంబరు నుంచి బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లావ్యాప్తంగా 1,208 పనులు పూర్తయ్యాయి.

- రవికుమార్, పీడీ, డ్వామా



శ్రీవారి సేవలో మీనాక్షి

తిరుమల శ్రీవారిని ఆదివారం ఉదయం దర్శించుకుని వస్తున్న సినీ నటి మీనాక్షి చౌదరి

తిరుపతిలో వాతావరణం అనుకూలించక..!

● చెన్నైలో ల్యాండ్ అయిన ఇండిగో విమానం

రేణిగుంట, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయంలో ఆదివారం రాత్రి 8 గంటలకు ల్యాండ్ కావాల్సిన ఇండిగో విమానం ఈదురుగాలులతో వాతావరణం అనుకూలించక 20 నిమిషాలు గాలిలో చక్కర్లు కొట్టింది. ఆ తర్వాత చెన్నై వెళ్లి ల్యాండ్ అయింది. అనంతరం రాత్రి 11.10 గంటలకు తిరుపతికి చేరింది. 11.45 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరాల్సి ఉండగా.. 12 గంటలకు బయలుదేరింది.

కిడ్నాప్ కేసులో ఇద్దరు సూత్రధారులను మళ్లీ విచారించిన పోలీసులు

● బ్యాంకు చెక్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులు, రెండు ల్యాప్‌ట్యాప్‌లు స్వాధీనం

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఇటీవల రాజేష్ కుటుంబాన్ని కిడ్నాప్ చేసిన ఘటనలో జైలులో ఉన్న ఆరుగురిలో ప్రధాన నిందితులు భార్గవ్, అరుణ్‌ను అలిపిరి పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. ఆర్థిక లావాదేవీల నేపథ్యంలో రూ.2 కోట్లు డిమాండు చేస్తూ తన స్నేహితుడు రాజేష్ కుటుంబాన్ని భార్గవ్ కిడ్నాప్ చేసిన విషయం తెలిసిందే. ఈనెల 5న ఆరుగురు కిడ్నాపర్లను రిమాండ్‌కు తరలించారు. వీరిలో అరుణ్, భార్గవ్‌ను తమ కస్టడీకి తీసుకుని అలిపిరి ఎస్‌ఐ లోకేష్ బాబు విచారించారు. బీటెక్ చదువుకున్న అరుణ్‌కు సాఫ్ట్‌వేర్‌పరంగా అవగాహన ఉంది. ఇతడితో కలసి భార్గవ్ కంపెనీలు ఏర్పాటుచేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని కొంత మంది నిరుద్యోగుల నుంచి సర్టిఫికెట్లు తీసుకున్నట్లు తెలిసింది. వీటి ద్వారా బ్యాంకుల్లో రుణాలు తీసుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది. ఈ ఇద్దరు నిందితుల నుంచి చెక్కులు, క్రెడిట్, డెబిట్ కార్డులు, రెండు ల్యాప్‌ట్యాప్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారి నేర చరిత్రపై ఆరాతీశారు. వీరిద్దరూ డబ్బులకోసం పలువురిని భయాందోళనకు గురిచేసినట్లు విచారణలో తేలింది. చీటింగ్ కేసులూ ఉన్నట్లు తెలిసింది. వారి నుంచి స్టేట్‌మెంట్‌లు రికార్డుచేశారు.



అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులు

బోయకొండ గంగమ్మకు పంచామృతాభిషేకాలు



అలంకరణలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. వేకువజామున ఆలయ అర్చకులు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి అమ్మవారిని స్వర్ణాభరణాలు, పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో తరలిరావడంతో క్యూలైన్లతో భక్తులు పోటెత్తారు. ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు క్యూలైన్లలో భక్తుల రద్దీ కొనసాగింది. భక్తుల ఏర్పాట్లును ఆలయ ఈవో ఏకాంబరం పర్యవేక్షించారు. అనంతపురం ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్‌లు అమ్మవారిని దర్శించుకున్నారు.

కిక్కిరిసిన ముక్కంటి ఆలయం



ముక్కంటి ఆలయం ఆదివారం కిక్కిరిసింది. మూడు రోజుల పాటు వరుస సెలవులు రావడం, ఇంటర్ ఫలితాలు వెలువడడంతో భక్తుల తాకిడి పెరిగింది. శనివారం రాత్రి పట్టణంలోని లాడ్జిలన్నీ భక్తులతో నిండిపోయాయి. ఆదివారం వేకువజాము నుంచి ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునేందుకు భక్తులు క్యూలలో బారులు తీరారు. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 30 వేల మంది దర్శించుకున్నట్లు అధికారుల అంచనా. దళారులు అడ్డదారిలో ప్రవేశించకుండా అధికారులు కట్టుదిట్టంగా వ్యవహరించడంతో సామాన్య భక్తులు సంతృప్తికరంగా దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మొత్తం ఐదు విభాగాల్లో 5723 రాహు కేతు పూజలు జరిగాయి. రూ.50 శీఘ్ర దర్శనం టికెట్లు 4312, రూ.200 ప్రత్యేక ప్రవేశ దర్శనం 4312 టికెట్లను భక్తులు కొనుగోలు చేశారు. అంతరాలయ దర్శనం టికెట్లు రికార్డు స్థాయిలో భక్తులు కొనుగోలు చేశారు. అంతరాలయ దర్శనం కోసం భక్తులు దళారులను ఆశ్రయించకుండా అడ్డుకట్ట వేసేందుకు రెండు నెలల క్రితం రూ.500 టిక్కెట్లను ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. మెల్లగా ఈ టిక్కెట్ల కొనుగోళ్లు పెరుగుతున్నాయి. ఆదివారం ఒక్క రోజే 618 టికెట్ల విక్రయాలు జరిగాయి.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

కుమారుడి కోసం మొక్కు చెల్లించి..!



సింగపూర్‌లో జరిగిన అగ్నిప్రమాదం నుంచి తమ కుమారుడు మార్క్ శంకర్ సురక్షితంగా బయటపడడంతో శ్రీవారికి మొక్కు చెల్లించుకునేందుకు ఆదివారం సాయంత్రం డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా తిరుమలకు వచ్చారు. టీటీడీ నిబంధనల ప్రకారం డిక్లరేషన్‌పై సంతకం చేసిన ఆమె వరాహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం శ్రీవారికి మొక్కుగా తలనీలాలు సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి, తిరుమల

భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం



ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవ సోదరులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): క్రీస్తు పునరుద్దాన పండుగను ఆదివారం క్రైస్తవ సోదరులు ఘనంగా నిర్వహించారు. స్థానిక సీఎస్ఐ మెమోరియల్ చర్చిలో పాస్టర్ రాకేశ్‌నిమ్రోద్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు మృతి చెంది మూడో రోజు సజీవుడై తిరిగిలేచారని తెలిపారు. ఏసుక్రీస్తు పాపులను సైతం సన్మార్గంలో నడిపించారన్నారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అన్నదానం చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి రవికుమార్, భరత్‌భూషన్, కృపాకర్, సురేశ్, ఉదయ్‌కుమార్, క్రైస్తవ సోదరులు పాల్గొన్నారు.

వాల్మీకి సంక్షేమ సంఘ కార్యవర్గం ఏకగ్రీవం



శంకరప్ప



సుబ్రహ్మణ్యం

పెద్దపంజాణి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వాల్మీకి సంక్షేమ సంఘం పెద్దపంజాణి మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం పలమనేరు నియోజకవర్గ నాయకులు అద్దాల నాగరాజు ఆధ్వర్యంలో పెద్దపంజాణిలో కార్యవర్గ ఎంపిక జరిగింది. అధ్యక్షుడిగా శంకర్రాయలపేట శంకరప్ప, గౌరవాధ్యక్షులుగా నాగేశ్వరరావు, దొరస్వామిలను, ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ సుబ్రహ్మణ్యం, నవీన్, రామాంజులు, ఉపాధ్యక్షులుగా గణపతి, రాజాబాబు, రెడ్డెప్ప, మునిరత్నం, కృష్ణప్ప, కోశాధికారిగా మహేష్‌కుమార్, గౌరవ సలహాదారులుగా గంగప్ప, చలపతిలను ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండలంలోని వాల్మీకులు పాల్గొన్నారు.

రావణబ్రహ్మ వాహనంపై రుద్రశివుడి విహారం



రామకుప్పం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రామకుప్పంలోని కాశీవిశ్వేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారు రావణబ్రహ్మ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులు నారాయణప్ప కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, అనంతరం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు నిర్వహించి విశేష అలంకరణలు చేశారు. రాత్రి స్వామి వారిని రావణబ్రహ్మ వాహనంపై ఊరేగించారు. అనంతరం స్థానిక బ్రహ్మణ వీధిలో పార్వేటోత్సవం వైభవంగా నిర్వహించారు.

కంటి శస్త్రచికిత్సలకు 15 మంది ఎంపిక



కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన వైద్యశిబిరంలో ఉచిత కంటి ఆపరేషన్లకు 15 మందిని ఎంపిక చేసినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు త్రిమూర్తిరెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక బీఎంఎస్ క్లబ్ ఆవరణలో కుప్పం పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్యులు దాదాపు 40 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఇందులో 15 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో ఎస్ఐ లోకేశ్, సురేశ్, సీవీ రెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ జయంతిని జయప్రదం చేయాలి

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల ర్యాలీని విజయవంతం చేయాలని దళిత సంఘ నాయకులు పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక అంబేడ్కర్ ప్రజా భవన్‌లో జరిగిన సమావేశంలో పలువురు నాయకులు మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా నిర్వహించే ర్యాలీలో బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలు, దళిత వర్గ ప్రజలు అధికసంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు సుమిత్ర రమణ, శ్రీనివాసులు, చంద్ర, మహానంది, జేవీ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్ నకారా సహకారంతోనే పింఛన్లు



డీఎస్ నకారా చిత్రాపటానికి నివాళులర్పిస్తున్న పింఛనుదారులు

పలమనేరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): డీఎస్ నకారా కృషి వల్లే నేడు ఉద్యోగ విరమణ చేసిన వారంతా పింఛన్లు అందుకుంటున్నారని ప్రభుత్వ పింఛనుదారుల సంఘం అసోసియేషన్ అధ్యక్షులు గురురాజారావు అన్నారు. ఆదివారం పలమనేరులో డీఎస్ నకారా జయంతిని పెన్షనర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సంఘ అధ్యక్షులు కృష్ణమూర్తి, కార్యదర్శి గౌస్, అధ్యక్షులు గురుస్వామినాయుడు, మోహన్, నాగభూషణం, సభ్యులు అక్బర్‌బాషా, చంద్రశేఖర్, చక్రపాణిశెట్టి, రామానాయుడు, ఆంజప్ప, మస్తాన్, చెంగాలయ్య, పురుషోత్తం, సాంబయ్య, సుబ్రమ్మణ్యం, సోమశేఖర్, వినాయకం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

పుంగనూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి ఆదివారం బీజేపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రపంచ దేశాలు అంబేడ్కర్‌ను కొనియాడుతున్నాయన్నారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు నరసింహులు, పట్టణ అధ్యక్షుడు జగదీష్‌రాజు, మల్లికారాణి, పెద్దమరం బాబు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో 'ఉజ్జాయిని' ప్రభంజనం



పుంగనూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ఉజ్జాయిని ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కాలేజీ డైరెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఇంటర్ మొదటి సంవత్సరంలో 11 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణులయ్యారన్నారు. ద్వితీయ సంవత్సరంలో 25 మందికి గాను 22 మంది ఉత్తీర్ణత సాధించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థిని లిఖిత 975 మార్కులు సాధించినట్లు తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ ప్రారంభమయ్యేనా..!

● యార్డులో సేవల కోసం రైతుల ఎదురుచూపు ● టమోటా సీజన్ ప్రారంభమైనా తప్పని పాట్లు
● అందుబాటులోకి వస్తే తీరనున్న రవాణా ఖర్చులు



సోమల వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్మించిన మండీల సముదాయం

సోమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సోమల మండల కేంద్రంలో రైతుల కోసం వ్యవసాయ మార్కెట్ యార్డు నిర్మాణ పనులు గత నాలుగేళ్లుగా రూ.7.23 కోట్ల వ్యయంతో ఏపడుతూ ప్రస్తుతం 90 శాతం పనులు పూర్తి చేశారు. మిగిలిన అరకొర పనులు నత్తనడకనే సాగుతున్నాయి. అయితే పనులు పూర్తి కాకుండా.. రైతులకు అందుబాటులోకి తీసుకురాకుండానే గత ఏడాది ఫిబ్రవరి 28న మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ప్రారంభించారు. సదుం, సోమల మండలాల రైతుల కోసం 1996లో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటైంది. అప్పటి నుంచి సోమల సింగిల్ విండో కార్యాలయంలోని అద్దె గదిలోనే నేటికీ కమిటీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. 15 ఏళ్ల క్రితం సోమల-కందూరు మార్గంలోని పుల్లయ్యతాత కుంట వద్ద ప్రభుత్వ నిధులతో మార్కెట్ యార్డు నిర్మాణానికి 10 ఎకరాలు సేకరించింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి చొరవతో నిధులు మంజూరై నాలుగేళ్లుగా నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఎన్నికల కు ముందుగా 75 శాతం పనులు పూర్తి కావడంతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి యార్డును ప్రారంభించారు. మార్కెట్ యార్డులో రైతుల వ్యాపార కార్యకలాపాలకు, పలు గదుల నిర్మాణాలు పూర్తి చేశారు. టమోటా, మామిడి, చింత మండీలు ఏర్పాట య్యాయి. సి మెంట్ రోడ్లు పూర్తి స్థాయిలో నిర్మాణాలు జరిగాయి. ఇక అధికారులు చొరవ తీసుకుని టమోటా, మామిడి మండీల కోసం దరఖాస్తు చేసుకున్న వ్యాపారులకు గదుల కేటాయింపు చేయాల్సి ఉంది. సోమల, సదుం మండలాల్లో వేలాది ఎకరాల్లో టమోటా, మామిడి తోటలు విస్తారంగా ఉన్నాయి. రైతులు తాము పండించి టమోటా పంటలను పలమనేరు, పుంగనూరు, కోలార్, వడ్డిపల్లె, మదనపల్లె, దామలచెరువు మార్కెట్‌లకు తరలించి అమ్మకాలు జరుగుతున్నాయి. రవాణా ఖర్చులు పెరిగి రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. సోమల యార్డులో లావాదేవీలు కొనసాగితే రైతులకు రవాణా ఖర్చులు తగ్గుతాయని నిరీక్షిస్తున్నారు. అలాగే రైతుల కోసం మార్కెట్ యార్డులో నిర్మించిన గోడౌన్లలో తమ పంటలను నిల్వ చేసుకునే సౌకర్యాలు ఉండటంతో యార్డు సేవల కోసం ఎదురుచూస్తున్నారు. వరి కోతలు చేసిన కొందరు రైతులు తమ ధాన్యం నిల్వ చేసుకోలేక అమ్మకాలు చేశారు. వ్యవసాయ ఉత్పత్తులు రైతులు అమ్ముకునేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

పనులు పూర్తికాగానే యార్డు ప్రారంభిస్తాం

సోమల వ్యవసాయ మార్కెట్‌లో 90 శాతం పనులు పూర్తయ్యాయి. జిల్లా అధికారులు ఆదేశాలు ఇస్తే గదులు కేటాయించి టమోటా, మామిడి కొనుగోలుకు చర్యలు తీసుకుంటాం.

- సరళాదేవి, ఏఎంసీ కార్యదర్శి

యార్డులో కొనుగోళ్లు జరగాలి



మాకు 5 ఎకరాల్లో మామిడి తోట ఉంది. ఏటా కాయలు కోసి దశల వారీగా దామల్‌చెరువు మార్కెట్‌కు పంపుతున్నాను. రవాణా ఖర్చు అధికంగా ఉంది. అమ్మకాలు చేసినా పదేపదే అక్కడి వెళ్లి డబ్బులు వసూలు చేసుకోవాలి. సోమలలో మార్కెట్ యార్డులో కొనుగోళ్లు చేస్తే ఇక్కడే మా మామిడిని అమ్ముకోగలం. అధికారులు ఈసీజన్ కైనా యార్డులో కొనుగోలు ప్రారంభానికి చర్యలు తీసుకుంటే రైతులకు అనుకూలంగా ఉంటుంది.

- రామచంద్ర, సూరయ్యగారిపల్లె





నూతన మార్కెట్ యార్డు, అద్దె గదుల్లో కొనసాగుతున్న కార్యాలయం

పంటలకు ధరల్లేక రవాణా భారం



టమోటా పంటకు గిట్టుబాటు ధర లేదు. 15 కిలోల బాక్సు రూ.150 లోపే ఉంది. స్థానికంగా మార్కెట్ సౌకర్యం లేకపోవడంతో టమోటాలను పుంగనూరు, పలమనేరు, కలికిరి మార్కెట్‌లకు తీసుకెళ్లడానికి 15 కిలోల బాక్సు కోసం రూ.20 ఖర్చు అవుతోంది. సోమలలో మార్కెట్ యార్డును ప్రారంభిస్తే రవాణా ఖర్చులు తగ్గుతాయి. అధికారులు స్పందించి యార్డులో టమోటాలు, మామిడి కొనుగోలుకు ఈసీజన్‌లోనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి. యార్డు ప్రారంభంతో పలువురు కూలీలకు ఉపాధి కలుగుతుంది.

- పీఎస్ రాజన్న, సోమల

సీజన్‌తో పనిలేకుండా టమోటా సాగు చేస్తాం



సీజన్‌తో నిమిత్తం లేకుండా పది ఎకరాల్లో దశల వారీగా టమోటా సాగు చేస్తున్నాం. సోమల మార్కెట్ యార్డులో కొనుగోళ్లు లేకపోవడంతో కోలారు, పలమనేరు, వడ్డిపల్లె, పుంగనూరుకు టమోటాలు తీసుకెళ్లి అమ్మకాలు చేస్తున్నాం. రవాణా ఖర్చులు పెరిగాయి. చాలా ఇబ్బందిగా ఉంది. రైతులు మార్కెట్‌కు పోకుంటే వ్యాపారులు ధరలు ఇష్టం వచ్చినట్లు పట్టీలు వేస్తారు. వారు ఇచ్చిన పట్టీల డబ్బు తీసుకోవాలి. దూర ప్రాంతాల మార్కెట్‌కు నిత్యం వెళ్లలేం. సోమలలో మార్కెట్ ప్రారంభిస్తే టమోటాల అమ్మకాల సమయంలో ఇక్కడే ఉండి వ్యాపారుల ధరలు, కొనుగోలును చూడొచ్చు. త్వరలోనే ఈ సీజన్‌కైనా యార్డులో కొనుగోళ్లు సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

- మురళీ, టమోటా రైతు, కరకమంద



మాజీ మంత్రి పెద్దిరెడ్డి ప్రారంభించిన శిలాఫలకం

నేడు గ్రీవెన్స్‌డే రద్దు

కుప్పం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కడా పీడీ వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు కడా కార్యాలయ అధికారులు తెలిపారు. ఏప్రిల్ 14న భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతి ప్రభుత్వ సెలవు దినం కావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

ఘనంగా సోమేశ్వరస్వామి మొక్కుబడి ఉత్సవం



పశువుల నీటితొట్టె ప్రారంభిస్తున్న టీడీపీ నాయకులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె గ్రామ సమీపంలో కొలువైన సోమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మొక్కుబడి ఉత్సవం ఘనంగా నిర్వహించారు. అర్చకులు మునివీరయ్య స్వామివారికి విశేషాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపీపీ కృష్ణవేణి, మాజీ సర్పంచ్ జైకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరానికి స్పందన



బైరెడ్డిపల్లెలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): బైరెడ్డిపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం చెన్నై శంకర్ నేత్రాలయ వైద్యులచే నిర్వహించిన ఉచిత కంటివైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్యనిపుణులు 40 మందికి కంటిపరీక్షలు నిర్వహించి 19 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ మురళీకృష్ణ, శ్రీనివాసులు, రమణ, గంగాధరం, చంద్ర, చిన్నప్ప, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

తీర్థంలో ఉచిత వైద్యసేవలు



తీర్థంలో వైద్య సేవలు అందిస్తున్న వైద్యులు

బైరెడ్డిపల్లె, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తీర్థం గ్రామంలో ఆదివారం తిరుపతి రమాదేవి మల్టీసూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య సేవలు అందించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు గోవిందస్వామి, రమేష్, శ్రీనివాసమూర్తి, విశ్వనాథ్, కృష్ణప్ప, మురళీ తదితరులు పర్యవేక్షించారు.

వర్షంతో ఆగిన విద్యుత్ సరఫరా

సోమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం రాత్రి కురిసిన వర్షానికి మూడు పంచాయతీల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం జరిగింది. మోస్తరు వర్షానికి మామిడి చెట్లల్లో పిందెలు నేలరాలాయి. ఈక్రమంలోనే విద్యుత్ తీగలపై కొమ్మలు విరిగి పడి నంజంపేట, ఆవులపల్లె, పెద్దఉప్పరపల్లె పంచాయతీల్లోని పలు గ్రామాల్లో సరఫరాకు ఆటంకం కలిగింది. ఆదివారం ఉదయం ట్రాన్స్‌కో ఏఈ మహేంద్రరెడ్డి, ఎల్ఐ చిన్నప్పరెడ్డి సిబ్బందితో కలిసి పనులను పర్యవేక్షించి సరఫరాకు చర్యలు చేపట్టారు.

అసాంఘిక కార్యకలాపాలకు నిలయం.. సచివాలయ భవనం



నూతన సచివాలయ భవనం

పెద్దపంజాణి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సచివాలయ భవనం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. సచివాలయ ఉద్యోగులు ప్రమాదకరంగా మారిన భవనంలో విధులు నిర్వహిస్తున్నారు. నూతన ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఈ భవనం ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా సచివాలయ భవనం నిర్మించిన కాంట్రాక్టర్ నేటి వరకు భవనం స్వాధీనం చేయలేదని చెబుతున్నారు. కాంట్రాక్టరుకు చివరి బిల్లు చెల్లించకపోవడంతో పనులు పెండింగులో ఉంచారని.. దీనిపై పలుమార్లు అధికారులు హెచ్చరించినా ప్రయోజనం లేదని పేర్కొంటున్నారు. అయితే నిర్మాణ పనులు పెండింగులో ఉన్నా గత ప్రభుత్వంలో సచివాలయ భవనం ప్రారంభోత్సవం చేశారు. అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఈ భవనం అసాంఘిక కార్యకలాపాలకు ఆవాసంగా మారిందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్న భవనం ప్రమాదకరంగా మారింది. తేలికపాటి జల్లులకే ఉరుస్తోంది. మరుగుదొడ్లు సైతం లేకపోవడంతో మహిళా ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇకనైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి నూతన సచివాలయ భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పెరిగిన ఎండ తీవ్రత



ఎండ తీవ్రతతో ఈత కొడుతున్న యువకులు

సోమల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సోమలలో ఎండ తీవ్రత 37 డిగ్రీలు మించడంతో ప్రజలు 10 గంటలకే గృహాల్లో నుంచి బయటకు రావడం లేదు. వీధుల్లో జన సంచారం లేక బోసిపోతున్నాయి. సోమలలో ఎండల తీవ్రత మరింత పెరుగుతుంది. ఇప్పటి వరకు ఎన్నడూ 37 డిగ్రీల ఉష్ణోగ్రతను సోమల మండల ప్రజలు చూడలేదు. నిప్పుల కొలిమిగా మారడంతో ఇబ్బందులు పడుతున్నారు. కూలీ పనులకు కూలీలు రావడంలేదు. వ్యవసాయ పనులు రైతులకు భారంగా మారాయి. మార్చి, ఏప్రిల్ నెలల్లో నాటిన టమోటా, వంగ మిరప పంటలు ఎండల తీవ్రతతో ఎదుగుదల లేకపోతుంది. పశువులను మేతకు తీసుకెళ్లలేక గృహాల వద్దనే గడ్డిని మేత వేస్తున్నారు. యువకులు ఎండలతో బావులు, చెన్నపట్నం చెరువు వద్దకు ఈతలకు వెళ్తున్నారు. పుంగనూరు - తిరుపతి ప్రధాన రహదారి పక్కనే చెన్నపట్నం చెరువు ఉండటంతో ఈమార్గంలో ప్రయాణం చేసే వాహనదారులు సైతం ఉల్లాసంగా ఈత కొడుతూ సేద తీరుతున్నారు.

కమనీయం.. సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

పుంగనూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు బజారువీధిలో వెలసిన రామాలయంలో ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. సీతారాముల కల్యాణ విశేషాలను అర్చకులు వివరించారు. ఆలయాన్ని ప్రత్యేకంగా పూలతో ముస్తాబు చేశారు. కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డిని కలిసిన చల్లా



నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

పుంగనూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి, జాతీయ బీజేపీ కార్యవర్గ సభ్యులు నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డిని ఆదివారం పుంగనూరు టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. తిరుపతిలోని ఓ వివాహ వేడుక కార్యక్రమంలో చల్లా రామచంద్రారెడ్డి మాజీ సీఎం కిరణ్‌ను కలిసి మాట్లాడుకున్నారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన



దేవళంపేటలో అవగాహన కల్పిస్తున్న కళాజాత బృందం

కల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని. తడి, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి ఎరువులను తయారు చేసి సంపద సృష్టించాలని కళాజాత బృందం సభ్యులు ఆదివారం గ్రామాల్లో అవగాహన కల్పించారు. పులిచెర్ల మండలం దేవళంపేట, పాతపేట, మతుకువారిపల్లి, అయ్యావాండ్లపల్లి పంచాయతీల్లో ప్లాస్టిక్‌తో ఉపయోగంతో కలిగే నష్టాలు, అంటువ్యాధులు, ఇంటింటా చెత్త సేకరణపై అవగాహన కల్పిస్తూ కళాజాత చేపట్టారు. పంచాయతీ కార్యదర్శులు సంతోష్, వెంకట్రమణ, గణేష్, సూర్య, కళాజాత బృందం సభ్యులు తెలిపారు.

వేమనపల్లెలో త్రైత సిద్ధాంత గ్రంథాల ప్రచారం



ప్రచారం చేస్తున్న ఇందూ జ్ఞానవేదిక సభ్యులు

గంగవరం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేమనపల్లెలో ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో త్రైత సిద్ధాంత గ్రంథాలపై ప్రచారం నిర్వహించారు. శ్రీరామనవమి, ఉగాది పండుగలకు ప్రత్యేక చరిత్ర ఉందన్నారు. కార్యక్రమంలో ఇందూ జ్ఞానవేదిక సభ్యులు భాస్కర్, బాలాజీ, హేమంత్‌కుమార్, రెడ్డెమ్మ, జ్యోతి, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం



గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత నారాయణల కల్యాణోత్సవాన్ని భక్తులు కనుల పండుగగా వీక్షించారు. ఆలయంలో ఆదివారం టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్టుకు చెందిన భాగవతారిణి శారద హరికథా కాలక్షేపం చేయగా, వెంకటేశ్వర భక్తిగీతాలు, అన్నమయ్య సంకీర్తనలను రెడ్డెమ్మ ఆలపించారు. కల్యాణోత్సవం పూజలకు చిత్తూరు నగరానికి చెందిన నీలమ్మ, చంద్రాచారి దంపతులు, మదనపల్లెకు చెందిన హరీష్‌లు ఉభయదారులుగా వ్యవహరించారు. ఆలయ సాంప్రదాయ ప్రకారం పట్టువస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు.



దిగువమాఘంలో రాజగోపాల్‌నాయుడు విగ్రహం వద్ద గల్లా అరుణకుమారి కుటుంబీకులతో కలిసి ఆదివారం నివాళులర్పిస్తున్న సినిమా కథల రచయిత, ఎంపీ విజయేంద్ర ప్రసాద్

ఆసక్తిగా అమ్మవారి అలక పాన్పు

● భక్తి శ్రద్ధలతో బిక్షాండి ఉత్సవం



స్వామి అమ్మవార్లకు బిక్షాండి ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

చిత్తూరు కల్చరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోనే కోదండ రామాలయంలో జరుగుతున్న శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం పురవీధుల్లో భక్తి శ్రద్ధలతో ఉత్సవ మూర్తులకు బిక్షాండి ఉత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయం ముందర సీతారాముల అలకపాన్పు ఘట్టాన్ని రమణీయంగా జరిపారు. సీతాదేవి అలక పాన్పులో భాగంగా అర్చకులు, ఈవోలు భక్తుల తరపున అమ్మవారికి ముడుపులు చెల్లించి అలక వీడే కార్యక్రమాన్ని వైష్ణవ సంప్రదాయంలో నిర్వహించడం భక్తులను అలరించింది. సాయంత్రం సి.వెంకటరత్నం శెట్టి ఉభయంతో స్వామి అమ్మవార్లకు పుణ్యకోటి విమాన సేవను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ అధికారులు, అర్చక బృందం, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థికి ఎంపీ, ప్రభుత్వవిప్ అభినందనలు



నిఖిత్‌ను అభినందిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరుసిటీ/గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సర ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ చాటిన విద్యార్థి ఏ.నిఖిత్ చౌదరిని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అభినందించారు. గంగాధర నెల్లూరు మండలం గారంపల్లెకు చెందిన నిఖిత్ చౌదరి తిరుపతి నారాయణ కాలేజీలో ఇంటర్ చదివాడు. ద్వితీయ సంవత్సర పరీక్షా ఫలితాల్లో ఎంపీసీలో 989 మార్కులు సాధించాడు. ఇందుకుగాను హైదరాబాద్‌లో తనను కలిసిన ఆ విద్యార్థిని ఎంపీ అభినందించారు. కృషి, పట్టుదల, క్రమశిక్షణతో మరిన్ని విజయాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎంపీ ప్రోత్సహించారు. అదేవిధంగా రాష్ట్ర ప్రభుత్వవిప్ డాక్టర్ థామస్ కూడా ఆదివారం నిఖిత్ చౌదరికి ఫోన్‌చేసి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

సభాస్థలిని పరిశీలించిన ఎమ్మెల్యేలు



సభాస్థలిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యేలు పులివర్తి నాని, మురళీమోహన్

పూతలపట్టు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పూతలపట్టులో సోమవారం జరుగనున్న అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన సభాస్థలిని పూతలపట్టు, చంద్రగిరి ఎమ్మెల్యేలు మురళీమోహన్, పులివర్తి నాని ఆదివారం పరిశీలించారు. అంబేడ్కర్ సర్కిల్ వద్ద ఏర్పాటు చేస్తున్న సభాస్థలితో పాటు వాహన పార్కింగ్ ప్రదేశాన్ని, పూతలపట్టు ఉన్నతపాఠశాల ఆవరణలో భోజన ఏర్పాట్ల స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో పూతలపట్టు, ఐరాల టీడీపీ మండల కన్వీనర్లు దొరబాబు చౌదరి, గిరిధర్ బాబు, రాష్ట్ర నాయకుడు యువరాజ్ నాయుడు, నాయకులు జార్జ్, ప్రతాపనేని చంద్రమౌళి, అమర్‌నాథ నాయుడు, గణపతి నాయుడు, సీఐ కృష్ణమోహన్, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జనసేన పార్టీని బలోపేతం చేయండి

● తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు



జనసేన పార్టీ నాయకులతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, పసుపులేటి హరిప్రసాద్

బంగారుపాళ్యం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో జనసేన పార్టీని బలోపేతం చేయాలని ఆ పార్టీ తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పసుపులేటి హరిప్రసాద్ అన్నారు. ఆదివారం జనసేన సీనియర్ నాయకుడు ఆవుల శాంతమూర్తి ఆధ్వర్యంలో బంగారుపాళ్యం మండలంలోని తుంబకుప్పం, ఈచినేరుపల్లి, తుంబపాలెం గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన జనసేన పార్టీ జెండాలను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, మండల పార్టీ అధ్యక్షుడు కోడి చంద్రయ్య, నాయకులు బుషా రాజేంద్ర, శివరాజ్, మహేష్, పవన్, కిషోర్, బాలు తదితరులు పాల్గొన్నారు.

రోగులకు పాలు, పండ్ల పంపిణీ



ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల క్లస్టర్ ఇన్‌చార్జి ఎస్సీ ధరణిప్రసాద్ నాయుడు జన్మదిన వేడుకలు ఆదివారం ఆయన స్వగ్రామమైన నలగాంపల్లెలో ఘనంగా నిర్వహించారు. బంగారుపాళ్యంలోని మండల టీడీపీ కార్యాలయంలో అభిమానులు ఏర్పాటు చేసిన కేక్‌ను నాయకులు కట్ చేసి పంచిపెట్టారు. ప్రభుత్వాస్పత్రిలో నలగాంపల్లెకి చెందిన మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ చిన్నయ్య, మాజీ ఎంపీటీసీ గిరిబాబు, ఎన్‌ఎస్ శివ, కృష్ణమూర్తి రోగులకు పాలు, రొట్టెలు,పండ్లు పంపిణీ చేశారు. బాలుర గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలకు టీడీపీ మండల ఉపాధ్యక్షుడు లోకనాథ నాయుడు, బీసీ రవీంద్ర నాయుడు ఏడు సీలింగ్ ఫ్యాన్లను వితరణ చేశారు. టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్‌గౌడ్, హరిప్రసాద్, రాజేంద్ర నాయుడు, విజయకుమార్, శివాజీ, రాజశేఖర్, రామయ్య తదితరులు పాల్గొన్నారు.

కొళాయిల్లో రంగునీరు



రంగునీరు కలిసి ఉన్న కొళాయి నీరు

నగరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): నగరి మున్సిపాలిటీ పరిధిలోని కీళపట్టు పెరుమాళ్‌నగర్‌లోని కొళాయిల్లో రంగునీరు రావడం స్థానికులను కలవరానికి గురి చేసింది.బోరులోని నీరు తాగడానికి అనువుగా లేక పోవడంతో స్థానికులు మున్సిపాలిటీ వారు సరఫరా చేసే నీటిపై ఆధారపడుతున్నారు. ఆ నీరు కూడా రంగుగా రావడంతో ప్రజలు విస్తుపోయారు. ఇలా వచ్చే నీటిని తాము ఎలా వాడుకోవాలంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజు వాటర్‌ప్లాంటు నుంచి తెచ్చుకోలేకే మున్సిపల్‌నీరు వాడుకుంటున్నామని, ఇలా రంగుతో వచ్చే నీటిని ఎలా వాడుకోవాలంటూ ప్రశ్నించారు. శుభ్రమైన నీటిని అందించడానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

మద్యం స్వాధీనం: మహిళ అరెస్టు

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చిత్తూరు రూరల్ మండలంలోని ముత్తుకూరు హరిజనవాడలో లక్ష్మీపతి ఇంటిలో భార్య గిరిజ వద్ద ఉన్న అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు బీఎన్‌ఆర్‌పేట ఎస్‌ఐ వెంకటనారాయణ తెలిపారు. ఆదివారం అందిన సమాచారం మేరకు లక్ష్మీపతి ఇంట్లో బీఎన్‌ఆర్ పోలీసులు తనిఖీలు నిర్వహించగా, ఆంధ్ర మద్యం 23 క్వార్టర్ బాటిళ్ల లభించాయని ఆయన చెప్పారు. వైన్ షాపుల్లో కొనుగోలు చేసి ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు గుర్తించామన్నారు. గిరిజపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

కారు ఢీకొని మోటర్‌సైక్లిస్ట్‌కు గాయాలు



తీవ్రంగా గాయపడ్డ ప్రకాష్

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బాలుర హాస్టల్‌కు సమీపంలో మోటర్ సైకిల్‌పై వెళుతున్న వ్యక్తిని ఓ కారు వేగంగా వచ్చి ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమైన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు... చిత్తూరు - పుత్తూరు ప్రధాన రహదారిలో గంగాధరనెల్లూరు మండలం అగరమంగళం దళితవాడకు చెందిన సీతారామ్ కుమారుడు ప్రకాష్ (27) ఆదివారం సాయంత్రం బాలుర హాస్టల్ సమీపంలో మోటర్‌సైకిల్‌పై వస్తుండగా, ఎదురుగా పుత్తూరు నుంచి చిత్తూరు వైపు వెళుతున్న ఎస్‌బీఆర్ పురానికి చెందిన కారు వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ప్రకాష్ తలకు తీవ్రరక్తగాయాలుకాగా, వెంటనే చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ దాము తెలిపారు.

నిరుపేదలకు అన్నదానం



కమలేష్ నాయుడికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

గుడిపాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన గుడిపాలలో మాజీ టీడీపీ అధ్యక్షుడు కమలేష్ నాయుడి వర్ధంతి సందర్భంగా నిరుపేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మాజీ జడ్పీటీసీ బాలాజి నాయుడు, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్, మాజీ ఎంపీటీసీ తుమ్మల సాంబశివ నాయుడు, నాయకులు జయదేవ నాయుడు, నాగరాజ్ యాదవ్, రవి నాయుడు, గోపి, మునస్వామి, బాలసుబ్రహ్మణ్యం, సుధాకర్ యాదవ్, బాబు రెడ్డి, గోవింద్ గౌడ్, జయరాం తదితరులు పాల్గొన్నారు.

'అమ్మఒడి' నిర్వాహకుడికి సన్మానం

చిత్తూరు రూరల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి) అమ్మఒడి ట్రస్ట్ నిర్వాహకుడు పద్మనాభ నాయుడిని తమిళనాడు, మదురైలోని తమిళ వీరుల సంఘం నాయకులు ఘనంగా సన్మానించారు. ఆదివారం ప్రపంచ వీధి బాలల దినోత్సవం సందర్భంగా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో పద్మనాభ నాయుడు చేస్తున్న సేవను గుర్తించి సంఘ సభ్యులు సన్మానించారు. అనంతరం ట్రస్ట్‌కు రూ.7200 విరాళం అందించినట్లు ఆయన తెలిపారు.

నేటి 'పీజీఆర్‌ఎస్' రద్దు

చిత్తూరు అర్బన్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరపాలక కార్యాలయంలో సోమవారం జరగాల్సిన పీజీఆర్‌ఎస్ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ నరసింహప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేడ్కర్ జయంతి నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని రద్దు చేశామన్నారు. నగర ప్రజలు ఈ విషయాన్ని గమనించి నగరపాలక కార్యాలయానికి రావద్దని కోరారు.

ఇంద్రానగర్‌లో ఘనంగా మట్టల ఆదివారం



ఇంద్రానగర్‌లో మట్టలతో ఊరేగింపుగా వస్తున్న క్రైస్తవులు

గుడిపాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాల పంచాయతీ ఇంద్రానగర్‌లో మట్టల ఆదివారాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్రైస్తవులు ఉపవాసం ఉండి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

కార్వేటినగరంలో....



కార్వేటినగరంలో మట్టలతో ఊరేగింపు

వెదురుకుప్పం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని బేతేలు షారోన్ చర్చిలో మట్టల ఆదివారం పండుగను జరుపుకున్నారు. ఈ క్రమంలో చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. విశ్వాసకులకు అన్నప్రసాదం అందజేశారు. పాస్టర్ ఆశీర్వాదం, బాబు, శ్రీధర్, విశ్వాసకులు పాల్గొన్నారు.

నేడు ఎంపీ దగ్గుమళ్ల కార్యక్రమాలు

చిత్తూరు సిటీ, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు సోమవారం ఉదయం 8 గంటలకు హైదరాబాద్ ఎయిర్‌పోర్టు నుంచి తిరుపతి విమానాశ్రయానికి చేరుకుంటారు. ఉదయం 9 గంటలకు తిరుపతిలోని రాష్ట్రీయ సంస్కృత విద్యాపీఠం యూనివర్సిటీలో నిర్వహించే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకల్లో పాల్గొంటారు. అనంతరం పూతలపట్టు మండల కేంద్రంలో నిర్వహించే అంబేడ్కర్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలసి పాల్గొంటారని ఎంపీ కార్యాలయ వర్గాలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

గుంతలమయంగా రహదారులు





మహారాజపురం వద్ద గుంతలమయంగా ఉన్న రోడ్డు - పాడైపోయిన ఆలపాక కండ్రిగ - జీఎం పురం రోడ్డు

విజయపురం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): సారూ.. రోడ్డులో గుంతలు పూడ్చండి అంటూ మండలంలోని మహారాజపురం వాసులు కోరుతున్నారు. కనకమ్మసత్రం - మహారాజపురం సరిహద్దు రోడ్డులోని గుంతలమయమైన ప్రదేశంలో ఉన్న షాపుల ముందు వాహనాలు నిలబెట్టడం వలన తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. మహారాజపురం రోడ్డు గుంతల్లో కోళ్ల రక్తాన్ని, అవశేషాలను పడేస్తుండటం వలన దుర్వాసన వెదజల్లుతుందని తెలిపారు. ఆలపాక కండ్రిగ - జీఎం పురం రోడ్డు గుంతలమయంగా ఉందని అన్నారు. అధికారులు స్పందించి ఈ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

టీచర్ల అభ్యున్నతికి ఎన్‌టీఏ కృషి అభినందనీయం

● ఎమ్మెల్యేలు జగన్మోహన్, మురళీమోహన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): టీచర్ల అభ్యున్నతికి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ చేస్తున్న కృషి అభినందనీయమని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్ కొనియాడారు. ఎన్‌టీఏ జిల్లా సర్వసభ్య సమావేశం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వి.జయప్రకాష్ నాయుడు అధ్యక్షతన ఆదివారం స్థానిక విజయం సీబీఎస్‌ఈ స్కూల్లో ఘనంగా నిర్వహించారు. సమావేశంలో ఉపాధ్యాయ సమస్యలపై సుదీర్ఘ చర్చ నిర్వహించి పరిష్కార మార్గాలను ప్రభుత్వానికి ప్రణాళిక రూపంలో ప్రతిపాదించనున్నారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ నోబల్ టీచర్స్ అసోసియేషన్ తెలుగుదేశం పార్టీ అనుబంధ సంఘమని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల ఆత్మగౌరవం, పెండింగ్ బకాయిలు, ప్రమోషన్లు, బదిలీలు వంటి సమస్యల పరిష్కారానికి యత్నిస్తున్నామని తెలిపారు. ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయులు జీవిత రూపకర్తలని కొనియాడారు. ఎన్‌టీఏ భవన నిర్మాణానికి స్థలం కేటాయించేందుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపుతున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ ఉపాధ్యాయ సేవలు ఎన్నటికీ మరువలేనివన్నారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు రాజన్ మాట్లాడుతూ పార్టీకి అనుబంధమైన ఎన్‌టీఏ సంఘానికి టీచర్లు పూర్తి సహాయ సహకారాలు అందించాలని సూచించారు. ఎన్‌టీఏ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు రెడ్డి రమేష్, రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరాజు మాట్లాడుతూ టీచర్ల సమస్యలను ప్రభుత్వం దృష్టికి అతి దగ్గరగా తీసుకుపోతున్న సంఘంగా ఎన్‌టీఏ నిలిచిందన్నారు. పదోన్నతులు, బదిలీలు పారదర్శకంగా చేపట్టేందుకు ఎన్‌టీఏ కృషి చేస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు జయప్రకాష్ నాయుడు సంఘం వార్షిక నివేదికను వినిపించారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హైమారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రామయ్య, రాష్ట్ర కార్యదర్శి సురేష్‌కుమార్, రాష్ట్ర, జిల్లా సంఘం నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనారాయణుల కల్యాణోత్సవం



కల్యాణంలో అమ్మవార్ల మాంగల్యాలను భక్తులకు చూపుతున్న అర్చకులు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేపంజేరిలో వెలసిన లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ఉత్సవమూర్తులైన శ్రీదేవి, భూదేవి సమేత నారాయణుల కల్యాణోత్సవాన్ని భక్తులు కనుల పండుగగా వీక్షించారు. ఆలయంలో ఆదివారం టీటీడీ అన్నమాచార్య ప్రాజెక్ట్‌కు చెందిన భాగవతారిణి శారద హరికథా కాలక్షేపం చేయగా, వెంకటేశ్వర భక్తిగీతాలు, అన్నమయ్య సంకీర్తనలను రెడ్డెమ్మ ఆలపించారు. కల్యాణోత్సవం పూజలకు చిత్తూరు నగరానికి చెందిన నీలమ్మ, చంద్రాచారి దంపతులు, మదనపల్లెకు చెందిన హరీష్‌లు ఉభయదారులుగా వ్యవహరించారు. వారిని ఆలయ సాంప్రదాయ ప్రకారం పట్టువస్త్రాలతో సత్కరించి స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మేనేజర్ నల్లా వెంకటేశులురెడ్డి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

చిత్రలేఖనంలో అవార్డులు సాధించిన కాళేపల్లె విద్యార్థులు



ప్రశంసాపత్రంతో పాటు మెమెంటో అందుకుంటున్న యశస్విని

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): చిత్రలేఖనంలో మండలంలోని కాళేపల్లె హైస్కూల్లో చదువుతున్న ముగ్గురు విద్యార్థులు అవార్డులు సాధించినట్లు హెచ్‌ఎం కేశవులురెడ్డి తెలిపారు. 12వ అఖిల భారత జాతీయస్థాయి యూత్ అండ్ చిల్డ్రన్స్ ఆర్ట్ కాంపిటేషన్ ఎగ్జిబిషన్, డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్స్ అకాడమి ఆధ్వర్యంలో విజయవాడలో నాలుగురోజులక్రితం చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు చిత్తూరు నగరానికి చెందిన డ్రాయింగ్ మాస్టర్ గణేష్ ఆధ్వర్యంలో శిక్షణ తీసుకుని గంగాధరనెల్లూరు మండలం వరత్తూరు పంచాయతీ కాళేపల్లె హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న కె.యశస్విని, టి.శరణ్య, ఎం.చరణ్‌కుమార్‌లు హాజరయ్యారు. వీరిలో కె.యశస్వినికి జాతీయ స్థాయిలో అఖిల భారత బాల చిత్రకళా అవార్డు, టి.శరణ్య, ఎం.చరణ్‌కుమార్‌లు బంగారు పతకాలను పొందినట్లు న్యాయనిర్ణేతలు ప్రకటించారు. అనంతరం విజయవాడ నగర పోలీస్ కమిషనర్ రాజశేఖర్‌బాబు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ధ్యానచంద్ర చేతుల మీదుగా వీరు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందుకున్నారు. చిత్రలేఖనం పోటీల్లో కాళేపల్లె హైస్కూల్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన ఈ ముగ్గురు విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు పలువురు టీచర్లు అభినందించారు.

రోడ్డుప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు: డీఎస్పీ



సిద్ధంగా ఉన్న ప్రమాదాల నివారణ ఫ్లెక్సీలు

నగరి, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు నగరి డీఎస్పీ మహమ్మద్ అజీజ్ తెలిపారు. రోడ్డు సేఫ్టీ నిమిత్తం సీఐ విక్రమ్ సిద్ధం చేసిన ఫ్లెక్సీలను ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణం, సెల్‌ఫోన్ డ్రైవింగ్ ఎక్కువగా వున్న దృష్ట్యా ఎస్పీ ఆదేశాల మేరకు వాహనదారులకు అవగాహన కల్పించడం కోసం ప్రత్యేకంగా కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కీలపట్టు, తెరణి క్రాస్ వద్ద బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణతో బాటు రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

తిరుచ్చిపై ఊరేగిన కోదండరామస్వామి



వెదురుకుప్పం, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో ఆదివారం తిరుచ్చి వాహనంపై కోదండ రామస్వామి ఊరేగారు. కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శాస్త్రోక్తంగా శ్రీరామ పట్టాభిషేకం జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేసిన బీజేపీ



అంబేడ్కర్ విగ్రహాన్ని శుభ్రం చేస్తున్న బీజేపీ శ్రేణులు

చిత్తూరు సెంట్రల్, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని జాతీయ బీజేపీ నేతల పిలుపు మేరకు ఆ పార్టీ శ్రేణులు ఆదివారం నగరంలోని పలు కూడళ్లలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాలను శుభ్రం చేసి, దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో బీజేపీ శ్రేణులు, స్థానిక అంబేడ్కర్ అభిమానులు పాల్గొన్నారు.

బీజేపీ నేతకు పితృ వియోగం



చిన్నమరెడ్డి(ఫైల్‌ఫొటో)

వెదురుకుప్పం, ఏప్రిల్ 13(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు బోడిరెడ్డి హనుమంతరెడ్డికి ఆదివారం పితృ వియోగం జరిగింది. వెదురుకుప్పం మండలం పెరుమాళ్లపల్లెకు చెందిన హనుమంతరెడ్డి తండ్రి చిన్నమరెడ్డి(70) ఆదివారం ఆకస్మికంగా మృతి చెందారని కుటుంబీకులు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం ఒంటి గంటకు అంత్యక్రియలు పెరుమాళ్లపల్లెలో జరుగుతాయని అన్నారు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ, బీజేపీ నాయకులు అక్కడికి చేరుకుని మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

'పిల్లలపై తల్లిదండ్రులు ఓ కన్నేసి ఉంచండి'

పెనుమూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల్లో ఇంటికి వచ్చిన పిల్లలపై తల్లిదండ్రులు జాగ్రత్తలు వహించాలని ఎస్‌ఐ రామచంద్రయ్య సూచించారు. ఆదివారం ఆయన పెనుమూరు పోలీసుస్టేషన్‌లో మీడియాతో మాట్లాడుతూ.. వేసవి సెలవుల్లో పిల్లలు సొంత గ్రామాలకు, బంధువుల ఇళ్లకు వచ్చిన తరువాత బావులు, చెరువుల వద్దకు ఈతకు, చేపలవేటకు వెళుతుంటారని అన్నారు. చిన్నపిల్లలు మామిడి కాయలు, తాటి ముంజల కోసమని చెట్లు ఎక్కడం వంటి పనులు చేస్తుంటారని, ఆ సమయాల్లో ప్రమాదాలు జరిగితే కన్నవారికి కడుపుకోత తప్పదని చెప్పారు. ప్రమాదాలు జరగక ముందే జాగ్రత్త పడటం మంచిదని ఆయన సూచించారు. వేసవి కాలంలో దొంగతనాలు అధికమవుతున్నాయని, గ్రామాలకు దూరంగా ఉన్న ఇళ్లల్లో ప్రతి ఒక్కరూ సీసీ కెమెరాలు అమర్చుకోవాలని చెప్పారు.

అర్జున తపస్సుకు అశోక్‌చెట్టు వితరణ



మానును ట్రాక్టర్ పైకి ఎక్కిస్తున్న గ్రామస్తులు

గంగాధరనెల్లూరు, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు మండలం శాతంబాకంలో మహాభారతం ఉత్సవాల్లో అర్జున తపస్సుకు వినియోగించేందుకు అశోక చెట్టు మానును బొమ్మవారిపల్లెకు చెందిన తలపనేని భారతి, గోవింద నాయుడు దంపతులు వితరణ చేశారు. ప్రతి ఏడాది తాటిచెట్టును తపస్సు మానుగా వినియోగించుకుని దాన్ని పక్కన పడేస్తారు. ఈ ఏడాది మళ్లీ తపస్సుమాను అవసరమైన క్రమంలో గంగాధరనెల్లూరు మండలం బొమ్మవారిపల్లెలో రైతు గోవింద నాయుడి పొలంలో ఉన్న అశోక చెట్టు కావాలని నిర్వాహకులు కోరా రు. దీంతో భారతి, గోవింద నాయుడు దంపతులు 40 అడుగుల అశోక చెట్టును ఉచితంగా ఇస్తామని ముందుకొచ్చారు. ఈ క్రమంలో ఆదివారం గ్రామస్తులు ఆ చెట్టుకు పూజలు చేసి శాతంబాకం మహాభారతం నిర్వాహకులకు అందజేశారు. దీంతో వారు దంపతులకు, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు శ్రీరాముడి పట్టాభిషేకం

గుడిపాల, ఏప్రిల్ 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బసవాపల్లి పంచాయతీ కోలావూరులో శ్రీరామ నవమి వారోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం 5 గంటలకు శ్రీరాముడి పట్టాభిషేకం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు చెన్నకేశవులు నాయుడు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు పాల్గొనాలని కోరారు.